# ఇంటాయనతో ప్రేమ వివాహం

### జరిగిన కథ

రాజేశ్వరి, కామేశ్వరరావు భార్యాభర్తలు. ప్రేమవివాహం చేసుకోవాలనే కోరిక పుట్టింది భార్యకు. ఆమె చేసిన ఏర్పాటు ప్రకారం ఉభయులు బందరు వెళ్లారు. అక్కడ సంపన్నుల గృహంలో ఆశ్రయం లభించింది కామేశ్వరరావుకు.

---

(క్రిందటి సంచిక తరువాయి)

నేను వచ్చి నాలుగు రోజులైంది. కాలాన్ని గుర్తించటానికి కూడా తీరిక దొరకడం లేదు. ముసలాయన కబుర్లతో, శాంత కాలక్షేపంతో, మామ్మగారి వడ్డనతో దినాలు క్షణాలుగా గడిచిపోతున్నవి. మగవాళ్ళు మొదటి రోజున మాట్లాడటంతప్ప తరవాత కలుసుకోలేదు. వాళ్ళకు తీరిక ఉండేది కాదు. చివరి అబ్బాయిమాత్రం సెలవు రోజుల్లో నాతోనే కాలక్షేపం చేసేవాడు. శాంత కాలేజీ లేనిసమయంలో నాతో మాట్లాడుతూ కూర్చునేది. రెండు రోజులు సెలవుపెట్టింది. ఎందుకంటే, "ఒంట్లో బావుండలేదు" అంది నవ్వుతూ.

అంతా సముద్రతీరానికి షికారుకు పోవాలని ప్రోగ్రాం నిర్ణయించారు. ప్రత్యేకంగా అది నాకొరకే ఏర్పాటు చేయబడిందని ఊహించుకున్నాను. మొదట్లో నేనూ ముసలాయనా పోయి చూచివద్దామని అనుకున్నాము. కాని ముసలాయన అంగీకరించలేదు. దాన్ని పిక్‌నిక్‌గా ఏర్పాటు చేయాలని, అందరూ రావాలని, అప్పుడే పరిపూర్ణమైన సంతోషం సంతృప్తి కలుగుతాయని అన్నారు.

వచ్చినదగ్గిరనుంచి పరిసరాలను పూర్తిగా గమనించలేదు. మేడకు నాలుగు పక్కలూ పరికించాను. ఒక పక్క నేనున్న మేడ కెదురుగా ఒక పెంకుటిల్లు ఉంది. పెంకుటిల్లైనా కొత్తమాదిరిగా ఉన్నది. ఇంటిముందు గార్డెన్ ఉంది. పూలమొక్కలెన్నో రకాలున్నాయి. వాటి మధ్య ఒక ఫౌంటెన్‌కూడా ఉంది. వరండాలో పడక కుర్చీలు వేసిఉన్నాయి. ఆ ఇంట్లో వాళ్లెవ్వరూ కనిపించలేదు. నాలుగైదు నిమిషాలు ఆ ఇంటివంకే చూశాను. నవ్వుకుంటూ ఇద్దరు తోటలోకి వచ్చి ఒక సిమెంటు బెంచీపై కూర్చున్నారు. నా హృదయం పగిలిపోయింది. ఎవరో పగులగొట్టారు. నిల్చోలేకపోయాను. నిలువెల్లా కంపించింది. ఏమీ కనిపించలేదు. చీకట్లు, అంతా చీకట్లు. మరోకసారి చూచాను. మసగ్గా కనిపించింది. ఆమె శ్రీమతి, అతడు పరాయివాడు. ఇద్దరూ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు! వాళ్ళు నన్ను గమనించలేదు. నేనెంతో ప్రయత్నించాను, నన్ను చూస్తారేమోనని. నా ప్రయత్నం విఫలమైంది. నిలువునా కుంగిపోయి కూలబడ్డాను, చేతులలో తల పట్టుకొని. శాంత వచ్చింది.

"వాట్ ఈజ్ దిస్? ఏమిటిలా ఉన్నారు? బావుండలేదా?" యక్షప్రశ్నలు వేసింది.

"మీరు రోజూ వడ్డిస్తున్న గారెగట్టా కడుపులో చేరి గడబిడ చేస్తున్నవి" అన్నాను.

"సింపుల్ మినప్పప్పు గారెలకు ఈ తీవ్రత ఏమిటి? డాక్టర్ని పిలుస్తాను." తటాలున పోయి బటన్ నొక్కింది. పనిమనిషి వచ్చాడు. అతనితో డ్రైవర్ని రమ్మనమని చెప్పింది. త్వరత్వరగా డ్రైవరూ వచ్చాడు. "కారు తీసుకు వెళ్ళి డాక్టరుగారిని తీసుకురా" అంది. వాడు వెళ్ళిపోయాడు.

నాకు నిజంగానే బాగా ఇబ్బందిగా ఉంది. మతిపోయింది. మళ్లీ బటన్ నొక్కింది. వచ్చిన పనిమనిషితో క్రిందవాళ్ళందర్నీ పైకి రమ్మనమని చెప్పింది. బిలబిలా వచ్చారంతా. అంతా ఆందోళన చెందారు. "ఏమి టేమిటి?" ఒకటే ప్రశ్నలు.

శాంత ఓపిగ్గా సమాధానం చెప్పింది. ముసలాయన నాడి పరీక్షచేసి, పైత్యం జాస్తిగా ఉన్నదని నిమ్మరసం నీళ్ళలో వేసి తాగించారు. ఈలోపల డాక్టరు వచ్చారు. పరీక్షచేసి, ఒక సూదిపోటు పొడిచారు. శాంత ఏమిటో అడుగుతున్నది. డాక్టర్‌గారు "అదుర్దా పడవలసినదేమీ లేదు" అని చెబుతున్నారు. ఫాన్ తిరుగుతున్నది. ఆగాలి సరిపడదేమోనని శాంత విసినిక్రరతో విసురుతున్నది.

వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోయారు. శాంతమాత్రం పరిచర్యలు చేస్తూనే ఉన్నది. నాకు హృదయం ఇక్కడ ఉంటేగా? ఆ పక్క పెంకుటింట్లో వాళ్ళేమి మాట్లాడుకొంటున్నదీ వినాలనిపిస్తున్నది. రెండు మూడుసార్లు

మామ్మగారు పైకి వచ్చారు. శాంత నా పక్కనే కూర్చున్నది. కబుర్లు చెప్పుతున్నది. మామ్మగారిని చూడగానే శాంత చలించలేదు. మామ్మగారూ గాభరా పడలేదు. నా మనస్సుమాత్రం సంకోచించింది.

"శాంతా, అబ్బాయిగారి కెలా ఉంది? సముద్రం షికారుకు రాగలరా, బాబూ? కులాసా చిక్కిందా?"

"చిక్కిందండీ. సముద్రం చూస్తేగాని మనస్సు సంతోషించదు" అన్నాను.

"మీరు కవితాప్రియులు కదూ!" శాంత పరిహాసం చేసింది.

నేను మందహాసం చేశాను. మామ్మగారు "కారు సిద్ధంగా ఉంది. ఇద్దరిూ తెమలండి" అని చెప్పి వెళ్ళిపోయారు. శాంత నా బెడ్డింగ్‌తీసి నాకు లాల్చీ, పైజామా సెలక్టుచేసి ఇచ్చింది. కాదనలేకపోయాను. "నేను బట్టలు వేసుకొని వస్తాను. మీరూ త్వరగా తెమలండి" అని గబగబా కిందికి పోతూంటే, ఆమె కాళ్ళ పట్టాలు, చేతిగాజులు స్వర తాళయుక్తంగా మంజుల ధ్వనులు చేస్తూ నాలో అవ్యక్త మధురమైన భావాలు కలిగించాయి. అలాగే ఆమె పోయినవైపు చూస్తూ నిల్చుండిపోయాను.

ముందుసారి కారులో కోడళ్ళిద్దరూ, పిల్లలూ,

శాంతి చేసుకొన్నట్లుగా పోయి చూశాను. శ్రీమతీ, అతనూ చూశారు. శాంత నా చెయ్యి పట్టుకొని ఉన్నది శ్రీమతి చూసింది. ఆ ముఖకవళికలు స్పష్టంగా గుర్తించలేకపోయాను. నేను కళ్ళుతిరిగి పడిపోతానేమో నని భయంతో నన్ను పట్టుకొన్నది శాంత. ఎలాంటి గగుర్పాటు లేదు ఎవ్వరిలోనూ. "మీరు మానసికంగా గాయపడ్డారని డాక్టర్‌గారన్నారు. నే నేవిధంగానైనా మీ మనస్సుకు కష్టం కలిగించేలాగున ప్రవర్తిస్తే నన్ను క్షమించండి. నేనిలా మానవ మనస్తత్వాలను అర్థం చేసుకోకుండా వాగేస్తుంటాను. నా నోరు అలాంటిది. నన్ను మీరు క్షమించలేరా?" శాంత అంటూంటే అప్రయత్నంగా కన్నీటిచుక్కలు ఆమె చెక్కిళ్ళపై పడినవి.

"శాంతా, నీవు నా హృదయంలో హృదయానివి. నా పాటకు పల్లవివి. నీ కన్నీటిచుక్కలకు నా హృదయం చెక్కలయిపోయింది. నీవు ఎలాంటి కష్టము నాకు కలిగించెయ్యలేదు. నీవు చేస్తున్న సేవకు నిన్నభినందిస్తున్నాను. నీ సన్నిధిలో అతీతమైన తీయని హాయి పొందుతున్నాను. నిన్ను నిందించుకుంటే నాకిక జీవితం లేదు" అనేశాను.

మెరుపువల్ల పరిసరాలుకూడా మెరిసినట్లు, శాంత చంద్రకాంతివలె ప్రసరింపచేసిన దరహాసంతో నా వంక చూస్తూంటే, నా హృదయం సముద్రంవలె పొంగింది.

## వెలివల సాంబశివరావు

మామగారూ వెళ్ళిపోయారు. కొడుకులిద్దరూ అక్కడికే వస్తామని చెప్పారు. వాళ్ళ పనిమీద ఉదయమే వెళ్ళారు. శాంత నాకోసం ఉంటానంది. కనక మొదటిసారి కారులో వెళ్ళలేదు. ముసలాయనకూడా ఉండమన్నారు. మిగిలింది నేనూ, శాంతా, మామ్మగారూను. కారు వాళ్ళను దించి వచ్చింది. కారులో కూర్చున్నాము. మామ్మగారు నన్నుగురించి మరికొన్ని వివరాలడిగారు. చెప్పాను. శాంత నాతో మాట్లాడటానికి ఎదురుచూస్తున్నది అవకాశం కోసం. ఆమె కుతూహలం అర్థంకాలేదు. మంగినపూడి రోడ్డుమీద కారు పోతున్నది. రోడ్డుకు ఇరుపక్కలా సరుగుడుతోటలు, ఝుమ్మునవచ్చే గాలి, సందడిచేసే చిగురాకుల గలగలలు, దూరాన సముద్రపుటలల కిలకిలలు. మామ్మగారు ప్రకృతి దృశ్యాలను చూసి స్వయంగా ఆనందిస్తున్నారు. శాంత తాను చూచి, నాకు చూపించి సంతోషాన్ని కలిగిస్తున్నది. మా నవ్వుల్లో మామ్మగారు భాగం పంచుకోలేదు.

కారు ఆగింది. ఎందుకు ఆగిందోనని చూస్తే ఒక అమ్మాయి ఆపింది. ఆ అమ్మాయి ఇలా చెప్పింది—"క్షమించాలండి, మేము సముద్రం చూద్దామని వస్తున్నాం. రిక్షా చక్రానికు గాలిపోయి ఆగింది. మీరు శ్రమ అనుకోక, మమ్మల్ని సముద్రం దగ్గిర దించితే, వచ్చేటప్పుడు సిటీ బస్సులోనన్నా వస్తాను." నేను మామ్మగారివంక చూచాను. మామ్మగారు బోలెడు విచారాన్ని వ్యక్తంచేసి, ఆ అమ్మాయిల స్థితికి వగచి, రమ్మని ఆహ్వానించారు. నేను ముందుసీటులో పోయి కూర్చు

"ఎవ రామె?"

చూపించాను.

"వెళ్ళేవాళ్ళు ఊరికే వెళ్ళరులెండి! వారి కేనో బోలెడు పనులు ఉండిఉంటాయి. అభ్యంతరం పెట్టడం మనది తప్పు."

నేను కాదనలేకపోయాను.

బాబిగాడికి రకరకాల బహుమతులు వచ్చాయి. నేనూ శాంతా కలిసి బహూకరించిన వాచీ చూసుకొని బాబి గాడు పొంగిపోయాడు. "అత్తయ్యా, మామయ్యా తెచ్చారిది" అని వాళ్ళఅమ్మకూ, నాయినమ్మకూ చూపించాడు. వాళ్ళు తృప్తిగా నవ్వుకున్నారు. పండుగ చక్కగా జరిగింది. మూడు గంటలూ నన్ను మెచ్చుకోవటంతోనే సరిపోయింది. శాంత నన్ను ఒక కవిగా, గాయకుడుగా పరిచయం చేసి అందరి పొగడ్తలకు పాత్రుడుగా చేసింది. నేను భారత భాగవతాలు ముసలాయనకు బహూకరించాను. ముసలాయన తెల్లని గడ్డం మరింత మెరిసింది. పుట్టినరోజు పండుగ అయిపోయిందనుకున్నాము. రాత్రి పది గంటలకు తీరిగ్గా కూర్చుని అందరం కలిసి కబుర్లు చెప్పుకున్నాము. కాలక్షేపం కాగానే వాళ్ల దగ్గిర నేను సెలవు తీసుకొని నా గదిలోకి వచ్చేశాను. పెట్టగోడ దగ్గిర నిలుచున్నాను. సెంకుటింట్లోనుంచి ఎవరో వెక్కివెక్కి ఏడవడం వినిపించింది. చెవులు రిక్కించి విన్నాను. అది శ్రీమతి ఏడుపు. ఒక్కసారి మేడ కుంగిపోయింది. భూతలమంతా కంపించిపోయింది. ఏమీ కనిపించలేదు. "శ్రీమతీ!" అని అరిచాను. ఏడుపు ఆగింది. ఆమె తోటలోకి వచ్చి మేడపైకి చూసింది. చేతులెత్తి నమస్కారం చేసింది. 'పిచ్చిరాజీ! నీ కేమీ అన్యాయం చెయ్యను' అని మనస్సులో అనుకున్నాను.

"ఇంకా పడుకోలేదా? ఇదిగో పాలు,తీసుకుంటారా?"

"శాంతా! నా కేమీ బావుంటంలేదు. నే నిక వెళ్లిపోతాను. బందరు చూశాను. వచ్చికూడా చాలా రోజులవుతున్నది"

"ఏమిటండీ, ఇంత అకస్మాత్తుగా ఇలాంటి భావం మీ కెందుకు కలిగింది? నే నేమన్నా తప్పు చేశానా? అయితే నన్ను క్షమించవచ్చుగదా. ఈమాత్రానికి కోపమైతే ఎలాగండీ? పాలు తాగండి. పోనీ మీకిష్టమైన ఒక పాట పాడి వినిపించనా? మనస్సు కుదుట పడుతుంది." పాట పాడటానికి రాగాలాపన చేస్తున్నది శాంత.

చింత నా హృదిలో శోకాలాపన చేస్తున్నది. రాగం తాళం కుదరని పాట ఏమంత మధురంగా ఉంటుంది? అలాగే ఉన్నదా పాట. నేను వ్రాసిన గేయం. ఆ గేయం రాజీకి కావడానికి వచ్చిన కొత్తలో కాంభోజి రాగంలో చేర్చాను. శాంత పాడుతున్నది. రాజీ ఏడుస్తున్నది. నా మనస్సు కుమిలిపోతున్నది. నేను ఉన్నది శాంత దగ్గిర. నా హృదయం శ్రీమతి దగ్గిర. మానసికంగా కుమిలిపోయాను. క్షణికములయిన మాపులతో కన్నీ నవ్వుతున్నది. నాటక పాట బావున్న దున్నది. శాంత నన్ను గమనించలేకపోలేదు. ఆమెకూడా కారణాన్ని ఊహించలేనంతగా బాధ పడింది.

...త కిందికి పోతూంటే మూడు గంటల బండికి ... చెప్పాను. జాలిగా చూసింది. "మీరు కలి

(మరువాయి ...గవ పేజీలో)

ఐదు కోట్ల మంది
ఫ్రెంచి వారు
తెలివితక్కువ వారు కారు!






స్టేన్స్ ఫ్రెంచి కాఫీ ఒక కప్పు సేవించితే హుషారు వస్తుంది—హాయిగా, తేలికగా ఆలోచనలు సాగుతాయి—శ్రేయింపు, చక్కగా తయారుచేయబడింది.
నూటికి 60 వంతులు కాఫీ, 40 వంతులు చికోరీ.

Stanes

స్టేన్స్ ఫ్రెంచి కాఫీ
హుషారు కలిగించేది

చేరికి అమరికగా వుండే 400 గ్రాముల ప్యాకెట్లు, 1 కిలో, 2 కిలోలు, 9 కిలోల ప్యాకెట్లు కలవు. 100 గ్రాముల వెదిపోస్ సంచులలోకూడా లభించగలవు.

లభ్యంకాగల ఇతర రకాలు:
ఎంపైర్ బ్రాండ్ ఫ్రెంచి కాఫీ : నూటికి 75 వంతులు కాఫీ, 25 వంతులు చికోరీ. బజారు బ్రాండ్ ఫ్రెంచి కాఫీ: నూటికి 50 వంతులు కాఫీ, 50 వంతులు చికోరీ.

దీ యునైటెడ్ కాఫీ సప్లయ్ కం., లి.,
టి. స్టేన్స్ & కం., లి., వారి సబ్సిడియరీ సంస్థ,
టిమిచ్చి రోడ్, కోయంబత్తూరు, సౌత్ ఇండియా
100 ఏళ్లకు పైగా కాఫీ ఉత్పత్తిదారులు

EP-UCS-16

డిస్ట్రి హోలాల్ సేలర్సు: తూర్పు ఆంధ్ర: మెస్సర్స్. కరణం హనుమంతరావు అండ్ సన్స్, ఈశ్వర్ నివాస్, తిరుమలరావు వీధి, గాంధీనగర్, కాకినాడ * పశ్చిమగోదావరి జిల్లా: మెస్సర్స్. శ్రీపాద నరసింహం బ్రదర్స్, జనరల్ మర్చంట్స్, ఏలూరు * హైదరాబాద్ సిటీ: మెస్సర్స్. వి. ఆర్. ఏజన్సీ, ట్రూప్ బజార్, జాంబాగ్, హైదరాబాద్.






గౌర్ మోహన్ దాస్ అండ్ కం.,
233, పాత చైనాబజార్ వీధి,
కలకత్తా—1
ఫోన్: 22—6580

ఐటెక్స్
సౌందర్యోపాదములు
ఐటెక్స్ (కాటుక)
ఐటెక్స్ బిందీ
ఐటెక్స్ దంతం పేస్టు
తయారుచేసినవారు:
అరవింద్ లేబరెటరీస్
పో. బా. 1415 మద్రాసు-17






పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నది, మీ ... గురించిన్ని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుచేవ్రేళ నిమిషములున్నూ, మీ సరియైన పిరునామాన్నూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ ... 12 మాసములవరకూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ ... కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య ..., ... తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షే ..., అకస్మా ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి ... మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహముల ... శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా ... మీకు తృప్తిగా ... అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

... DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)
POST BOX NO. 86, JULLUNDUR CITY


పండుగనాడు నువ్వు నా చేతికి వాచీ పెట్టడం చూసి..."

"దాని కళ్ళు మూసుకుపోయాయా?"

"అదేమిటే, శాంతా, అలా అన్నావు?"

"నువ్వేమి అనుకుంటారు? మీరు మగవాళ్ళు. ఏదన్నా చెల్లుతుంది. మిమ్మల్నయితే 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అని అంటారు. కాని మీ మనస్సు లెంత నిబ్బరమైనవో గమనించాలి. నన్ను మీరెలా చెయ్యాలనుకుంటే అలా చేసిపొండి. ఏనాడో నా జీవితాన్ని మీ చేతుల్లో ఉంచాను." గబగబా పోయింది. నా మాట వినిపించుకోలేదు. నేను నా గదిలోకి వచ్చి తలగడలోకి తలదూర్చి ఏడ్చాను. ఆ కన్నీ రలాగే ఇంకిపోయింది. శ్రీమతి ఉంటే వాటిని తుడిచేది. పది గంటలయింది. శాంత వచ్చి వాకిలి దగ్గిర నిల్చున్నది. ఎంతసేపయిందో వచ్చి! నేను తలెత్తి చూసేసరికి వాకిలి దగ్గిర నిల్చుని ఉన్నది.

"ఎందుకు ఏడుస్తున్నారు?" అని పైటచెంగుతో కన్నీటిచారలు తుడిచింది. "మిమ్మల్ని నేనేమన్నా కోపంగా అంటే క్షమించండి. క్షమించటానికికూడా తగనిదాన్నయితే, నా నుదుటివ్రాత అనుకొని దూరంగా వెళ్ళిపోతాను."

"శాంతా, నీ మనస్సు వెన్నలాంటిది. ఊరికే కరుగుతుంది. వెంటనే పేరుకొంటుంది. నీవిక వెళ్ళి పడుకో. స్థిమితంలేని నీ మనస్సుకి ఏమిచెప్పినా చికాగ్గానే ఉంటుంది."

"మీరీపూట భోజనం మానేశారు. అన్నీ వడ్డించి వచ్చాను, రండి."

"ఆకలిగాలేదు, శాంతా. నన్ను గురించి ఏమీ విచారించకు. పొద్దుపోయింది. ఎక్కువ మేలుకుంటుంటే ఆరోగ్యం దెబ్బతింటుంది."

"నాకీ నిద్రాదేవితో సుఖం ఒకనాడు ఉన్నది కనకనా? ఒంటిగంటవరకూ చదువుతూ కూర్చుంటాను. మరేం ఫరవాలేదు. రండి, ఇద్దరం కలిసి భోజనంచేద్దాం." చెయ్యి పట్టుకుని భోజనాల గదిలోకి లాక్కు వెళ్ళింది. చెయ్యిని విదిలించుకోలేను. ఇద్దరమూ ఎంగిలిపడ్డాము. శాంత నా గదిలోకి వచ్చి చదువుతూ కూర్చున్నది. కాగితాలు చూస్తున్నదిగాని, చదువు సాగడంలేదని తెలుస్తున్నది.

శ్రీమతినిగూర్చి మనస్సు ఆలోచిస్తున్నది. కళ్ళు శాంతను చూస్తున్నవి. ప్రత్యక్షమైన మూర్తితో శాంతను చూస్తున్నాను. మానసికంగా దానిని చూస్తున్నాను. శాంత నన్ను మాట్లాడించలేదు. నేను శాంతను మాట్లాడించలేను. శాంత చదువుతున్నది. నేను ఆలోచిస్తున్నాను కాబట్టి, మాట్లాడుకోవటానికి తీరిక ఎక్కడ? ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

కళ్ళు తెరిచాను. బాగా తెల్లవారింది. గబగబా పను లన్నీ కానిచ్చి, శాంతకు చెప్పకుండానే హాస్పిటల్‌కు బయలుదేరాను. సుగుణను పిలిచాను. ఆమె అప్పుడే హాస్పిటల్‌కు పోవటానికి బయలుదేరుతున్నది. ఇద్దరమూ బయలుదేరాము. సుగుణ నన్నెక్కువగా మాట్లాడించలేదు. నేనూ మాట్లాడించలేదు. నేను రాజీ ఆరోగ్యాన్ని గురించి ఆందోళన పడుతూ అడుగుతూంటే విచిత్రంగా చూసింది.

"ఒక ఉద్దేశాన్నైనా, ఆ అమ్మాయి అంటే మీకెంత

